

బక్క రవీందర్

ఎడిటర్

సెల్: 8501919707

తెలుగు దినపత్రిక

# డైలీ రిపోర్ట్

DAILY REPORT








సంపుటి: 1 సంచిక: 138 పేజీలు: 4 ఎడిటర్ : బక్క రవీందర్ ప్రచురణ: హైదరాబాద్ ఆదివారం 22 -12-2024 వెల: 5/రూ -


# ఏవీఎన్ఎల్ ఛైర్మన్స్ కప్ 2024

# ముగింపు వేడుకలు



**ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ మెదక్ రక్షణ మంత్రిత్వ శాఖ భారత ప్రభుత్వ సంస్థ**









**సంగారెడ్డి అర్బన్, డిసెంబర్ 21:(డైలీ రిపోర్ట్):** మెదక్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ఏవి ఎన్ ఎల్ యూనిట్, డిసెంబర్ 17 నుండి 21 వరకు ఏవిఎన్ఎల్ చైర్మన్స్ కప్ 2024 ముగింపు ఉత్సవాలలో శనివారం నిర్వహించింది. ఏవీఎన్ఎల్ అనేది రక్షణ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని 1వ డిఫెన్స్ పి ఎస్ యు, దీనిలో ఏవీఎన్ఎల్ అన్ని ఉద్యోగుల నుండి కార్పొరేటీకరణ తర్వాత క్రీడా ఈవెంట్‌లను నిర్వహిస్తుంది. వేర్వేరుగా నిర్వహిస్తున్న 16 రకాల గేమ్‌లలో పోటీలలో పాల్గొన్నారు. ఏవీఎన్ఎల్ యూనిట్ల స్థానాలు, ఏవీఎన్ఎల్ చైర్మన్స్ కప్ 2024 ప్రారంభ ఉత్సవాలు 20 సెప్టెంబర్ 2024న వెహికల్ ఫ్యాక్టరీ జబల్‌పూర్‌లో జరిగింది. తదనంతరం, ఇతర ఏవి అనిల్ యూనిట్లు సంబంధిత ప్రదేశాలలో వివిధ రకాల గేమ్‌లను నిర్వహించాయి, ఇది మెదక్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో ముగింపు ఈవెంట్‌లతో ముగిసింది. 21 డిసెంబర్ 2024న, ఏవీఎన్ఎల్ మెదక్ శరత్ స్టేడియంలో ఏవీఎన్ఎల్ ఛైర్మన్స్ కప్ 2024 ముగింపు వేడుక జరిగింది. బి. పట్నాయక్, ఐ ఓ ఎస్ ఎస్, డైరెక్టర్, ఏబీఎన్ఎల్ కార్పొరేట్ కార్యాలయం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎస్ ఎస్ ప్రసాద్, చీఫ్ జనరల్ మేనేజర్, ఏబీఎన్ఎల్ మెదక్, రంజన ప్రసాద్, చైర్‌పర్సన్, ఏబీఎన్ఎల్ డబ్ల్యూ డబ్ల్యూ ఏ మెదక్, ఏవీఎన్ఎల్ మెదక్ & అనుబంధ సంస్థల ఇతర సీనియర్ అధికారులు, డబ్ల్యూ డబ్ల్యూ ఏ కమిటీ సభ్యులు, యూనియన్లు, అసోసియేషన్లు, వర్క్ కమిటీ, జె సి ఎం సభ్యులు, అన్ని ఏవిఎన్ఎల్ యూనిట్ల క్రీడాకారులు ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు.





# బాధిత కుటుంబాన్ని పరామర్శించలేదేం!

## హీరో ఇంటికి క్యూ కట్టిన సినీ ప్రముఖులు..

## హీరో, నిర్మాత.. ఎవరూ పిల్లాడి దగ్గరకు పోలేదు

- పోలీసులు రావద్దని చెప్పినా థియేటర్‌కు హీరో
- అభిమానులు తోసుకొచ్చారు.. బాడీ గార్డ్స్ నెట్టారు
- తొక్కిసలాటలో మహిళ మృతి.. కోమాలో బాలుడు
- అయినా థియేటర్ నుంచి వెళ్లేందుకు హీరో ససేమిరా
- అరెస్టు చేస్తామని హెచ్చరించి డీసీపీ పంపించారు
- మానవత్వం లేని ఇలాంటి వాళ్లను అరెస్టు చేస్తే..
- నీచమైన భాషతో ప్రభుత్వాన్ని బద్నాం చేసే యత్నం
- పదేళ్లు మంత్రిగా పనిచేసిన వ్యక్తి
- సోషల్ మీడియాలో అడ్డగోలుగా పోస్టులు పెట్టారు
- ప్రాణాలు పోయినా ఏమీ అనొద్దనడం న్యాయమా?
- సినిమాలు తీసుకోండి.. వ్యాపారం చేసుకోండి..
- ప్రాణాలు పోతే మాత్రం ప్రభుత్వం చూస్తూ ఊరుకోదు
- సినీ పరిశ్రమకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరిక



2లో

హైదరాబాద్: "ఒక్కపూట జైలుకు వెళ్లి వచ్చిన హీరో ఇంటికి సినీ ప్రముఖులంతా క్యూ కట్టారు. ఆయనకు ప్రమాదం జరిగిందా? ఏమైనా జబ్బు పడ్డారా? హీరోను పరామర్శించేందుకు క్యూ కట్టిన సినీ ప్రముఖుల్లో ఒక్కరైనా బాధిత కుటుంబాన్ని ఎందుకు పరామర్శించలేదు!?

# నాపై తప్పుడు ఆరోపణలు!



2లో

- అవాస్తవాలతో నా వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారు
- నేను అక్కడ ఎలాంటి రోడ్ షో, ఊరేగింపూ చేయలేదు
- అభిమానులకు థాంక్యూ చెప్పేందుకే కారులోంచి చేతులూపా
- థియేటర్ నుంచి బయటకెళ్లాలని పోలీసులు నాకు చెప్పలేదు
- థియేటర్ సిబ్బంది చెప్పగానే అక్కడి నుంచి బయటికొచ్చేశాను
- జరిగిన ఘోరం గురించి మరుసటిరోజు తెలిసి షాక్ అయ్యాను

# పథకంపై ఇచ్చిన నివేదికను సభలో పెట్టండి



# టోల్ రుసుము శాశ్వతం కాదు

న్యూఢిల్లీ, డిసెంబరు 21: మౌలిక వసతుల ప్రాజెక్టుల అమల్లో అధికారులు నిజాయితీగా వ్యవహరించాలని నొక్కి చెబుతూ సుప్రీంకోర్టు కీలక తీర్పును వెలువరించింది. టోల్ రుసుము వసూలు శాశ్వత ప్రక్రియ ఏమీ కాదని స్పష్టం చేసింది. దాన్ని నిరంతరం వసూలు చేస్తామంటే అది నిరంకుశత్వం కిందకే వస్తుందని తెలిపింది. ఈ ప్రాజెక్టులు ప్రజా ప్రయోజనానికి ఉద్దేశించినవే తప్ప ప్రైవేటు సంస్థలు లాభాలు ఆర్జించడానికి కాదని తెలిపింది. ప్రజానీకంపై భారం మోపుతూ అన్యాయంగా ఇతరులకు లాభాలు వచ్చేలా సహకరిస్తామంటే అనుమతించబోమని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌ల ధర్మాసనం శుక్రవారం వెలువరించిన తీర్పులో తెలిపింది. డిల్లీ%-%నోయిడా డైరెక్ట్ (డీఎన్‌డీ) ఫ్లై వేపై టోల్ రుసుము వసూలు విషయమై కుదిరిన 'రాయితీ ఒప్పందాన్ని' 2016లో అలహాబాద్ హైకోర్టు కొట్టివేసింది. దీన్ని సవాలు చేస్తూ నోయిడా టోల్ బ్రిడ్జి కంపెనీ (ఎన్‌టీబీసీ) సుప్రీంకోర్టులో అప్పీలు చేసింది. విచారణ జరిపిన ధర్మాసనం హైకోర్టు తీర్పును సమర్థించింది. అసలు రాయతీ ఒప్పందమే లోపభూయిష్టంగా ఉందని తెలిపింది. "ఉత్తమ నిబంధన ఏమిటంటే... ప్రజా ప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకునే విధానాలు, నిబంధనలను ప్రభుత్వం రూపొందించాలి. అవి నిజంగా ప్రజలకు ప్రయోజనం కలిగించాలి. వాటి ద్వారా ఎవరూ అనుచిత లబ్ధి పొందకూడదు. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం, నోయిడాలు కలిసి ఎన్‌బీసీఎల్‌తో కలిసి కుదుర్చుకున్న రాయితీ ఒప్పందం అనైతికం, అన్యాయం, రాజ్యాంగానికి వ్యతిరేకమ"ని తెలిపింది. "అవసరమైన ప్రజా మౌలిక సదుపాయాలను కల్పించిందన్న కారణంతో ప్రజలు వందలాది కోట్ల రూపాయలు ఎన్‌టీబీసీఎల్, ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ సంస్థలకు చెల్లించేలా చేశారు. రుసుము రూపంలో ఆ ఫ్లై వేకు అయిన ఖర్చును ఎన్‌టీబీసీఎల్ తిరిగి వసూలు చేసుకుంది. లాభాలు కూడా ఆర్జించింది. అందువల్ల ఇంకా ఫీజు/టోల్ వసూలు చేయకుండా హైకోర్టు ఆదేశాలు ఇవ్వడంలో తప్పేమీ లేదు" అని పేర్కొంది. రాయితీ ఒప్పందంలోని 14వ ఆర్టికల్‌లో...టోల్‌ను శాశ్వత ప్రాతిపదికన వసూలు చేసుకోవచ్చన్న అర్థం వస్తుండడంతో దాన్ని హైకోర్టు కొట్టివేసింది. ఈ విషయంలో కూడా హైకోర్టు నిర్ణయంతో సుప్రీంకోర్టు ఏకీభవించింది. ప్రాజెక్టు వ్యయాన్ని అంచనా వేయడంలోనే అన్యాయం జరిగిందని భావించిన ధర్మాసనం రాయుతీ ఒప్పందంలోని లోపాలను ఎత్తి చూపింది. 'మొత్తం ప్రాజెక్టు వ్యయం' మదింపు కోసం అనుసరించిన సూత్రమే తప్పుడు విధానమని తెలిపింది.

# ప్రపంచానికే నైపుణ్య రాజధాని భారత్!

కువైత్ సిటీ, డిసెంబరు 21: భారతీయుల శ్రమశక్తి, నైపుణ్యాలు నవ కువైత్ నిర్మాణానికి ఎంతగానో ఉపయోగపడతాయని.. ప్రపంచానికే నైపుణ్య రాజధాని అయ్యే సత్తా భారత్‌కు ఉందని ప్రధాని మోదీ అన్నారు. రానున్న కొన్ని దశాబ్దాలపాటు ప్రపంచంలోనే అత్యంత యువ దేశంగా భారత్ ఉంటుందని పేర్కొన్నారు. కువైత్ రాజు షేక్ మిషాల్ అల్ అహ్మద్ అల్ జుబేర్ అల్ సబహ్ ఆహ్వానం మేరకు రెండు రోజుల పర్యటన నిమిత్తం శనివారం కువైత్‌కు చేరుకున్న ప్రధాని.. ఇక్కడి 'షేక్ సాద్ అల్ అబ్దుల్లా ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్'లో ప్రవాస భారతీయులతో ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. "మీరందరూ భారతదేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చారు. మిమ్మల్ని ఇలా చూస్తుంటే ఇక్కడ మినీ భారతదేశమే ఉన్నట్టుంది" అని ఆయన వ్యాఖ్యానించారు. "ఏటా భారతదేశం నుంచి కువైత్‌కు వస్తున్న వందలాది మంది భారతీయులు కువైత్ సమాజానికి భారతీయ ఆత్మను జోడిస్తారు. కువైత్ కాన్వాస్‌ను.. భారతీయ నైపుణ్యాలు, ప్రతిభతో నింపేస్తారు" అని మోదీ కొనియాడారు. నలభైమూడేళ్ల క్రితం.. 1981లో అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ తర్వాత.. ఒక భారత ప్రధాని కువైత్‌లో పర్యటించడం ఇదే మొదటిసారి. ఆ విషయాన్ని కూడా మోదీ ప్రస్తావించారు. "ఇక్కడి నుంచి ఇండియాకు రావడానికి మీకు పట్టేది నాలుగు గంటలే. కానీ.. ఒక భారత ప్రధాని కువైత్‌కు రావడానికి నాలుగు దశాబ్దాలు పట్టింది" అని పేర్కొన్నారు. 'ఎక్స్' వేదికగా తాను ఇచ్చిన మాట ప్రకారం ఇండియన్ ఫారిన్ సర్వీస్ మాజీ అధికారి, 101 సంవత్సరాల వయోవృద్ధుడు అయిన మంగళ్ సెయిన్ హండాను మోదీ ప్రత్యేకంగా కలిసి మాట్లాడారు.

# వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో 'భూ భారతి' మాకు రెఫరెండం



హైదరాబాద్, : ఎన్నో సమావేశాలు, చర్చలు, సంప్రదింపుల తర్వాతే భూ భారతి చట్టాన్ని రూపొందించినట్టు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. నాలుగేళ్ల తర్వాత వచ్చే ఎన్నికల్లో తమ పార్టీ పనితీరుకు భూ భారతి రెఫరెండంగా నిలుస్తుందన్నారు. మండలిలో భూ భారతి బిల్లుపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానంగా మంత్రి మాట్లాడారు. భూ భారతి చట్టం తమ ప్రభుత్వానికి శ్రీ రామరక్షగా నిలుస్తుందని చెప్పారు. "మనిషికి అన్నింటికంటే విలువైంది భూమి. ప్రపంచంలో అన్నింటికంటే విలువైంది, ప్రాణప్రదమైంది భూమి ఒక్కటే" అని ఆయన పేర్కొన్నారు. మనిషికి తన భూమి అంటే ప్రాణమని, అలాంటి ప్రాణాన్ని యమధర్మరాజులాంటి ధరణి తీసుకుపోతే వారి గతి ఏమిటి? యముడి నుంచి తెలివిగా తన భర్త ప్రాణాలు తెచ్చుకున్న సతీసావిత్రిలాగా ఇప్పుడు భూ భారతితో ధరణిలో పోయిన భూములు తిరిగి హక్కుదారులకు చేర్చే పరిస్థితి ఏర్పడిందని మంత్రి వివరించారు. గత నియంతృత్వ ప్రభుత్వం నలుగురికోసం ఒకరిద్దరుకలిసి చట్టాన్ని తయారు చేశారని ఆరోపించారు. ఇందిరమ్మ ప్రభుత్వంలో 4కోట్ల మంది కోసం అందరి అభిప్రాయాలు, ఆలోచనలు, సూచనలు, సలహాలు, ప్రజల ఆకాంక్షలను పరిగణనలోకి తీసుకుని చట్టం రూపొందించామని తెలిపారు. 'భూ భారతి రానున్నకాలంలో దేశంలోని ఇతర రాష్ట్రాలకు మార్గదర్శికానుంది. భూ భారతి ప్రజామోదం పొందిందన్న ఉక్రోషంతో బీఆర్‌ఎస్‌కు నిద్రపట్టడం లేదు. భూ భారతి భూ యజమానుల జీవితాల్లో సరికొత్త కాంతుల్ని ప్రసరింపజేస్తుంది. ఇది అమల్లోకి వస్తే... బీఆర్‌ఎస్ పెద్దలు దోచుకున్న భూముల వివరాలు బయటపడతాయి' అని మంత్రి అన్నారు. 2020 నూతన రెవెన్యూ చట్టం, ధరణి పోర్టల్.. కర్త, కర్మ, క్రియగా వ్యవహరించిన నాటి సీఎం కేసీఆర్.. తెలంగాణ సమాజంలో సృష్టించిన విధ్వంసం ఏంటో అందరికీ తెలిసిందేనన్నారు. రాష్ట్రంలో భూ సమస్యలకు శాశ్వత ముగింపు పలికేలా భూ భారతి చట్టాన్ని తెచ్చామని మంత్రి వివరించారు. దేశంలోని 18 రాష్ట్రాల్లో ఉన్న ఆర్వోఆర్ చట్టాలను పూర్తిగా అధ్యయనం చేసి ఈ నూతన చట్టానికి ప్రాణం పోశామన్నారు. దేశంలోనే నంబర్‌వన్‌గా, రోల్‌మోడల్‌గా భూ భారతి చట్టం నిలుస్తుందని మంత్రి పొంగులేటి చెప్పారు.

# బాధిత కుటుంబాన్ని పరామర్శించలేదేం!

(మొదటి పేజీ తరువాయి)

సినిమా చూడటానికి వెళ్లిన కుటుంబంలో మహిళ చనిపోతే 11వ రోజు వరకు హీరో, నిర్మాత ఎవరూ వారిని పరామర్శించలేదు. కనీసం ఆస్పత్రిలో ఉన్న ఆ పిల్లాడి దగ్గరకు పోలేదు. ఇది ఏ రకమైన మానవత్వం!?" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిలదీశారు. కనీసం వారిని పరామర్శించాలన్న మానవత్వం కూడా సినిమా పరిశ్రమకు లేదా!? అని ప్రశ్నించారు. ప్రజల ప్రాణాలు పోయే సంఘటనలు జరుగుతాయంటే సినీ పరిశ్రమకు ప్రత్యేక రాయితీలు కల్పించబోమని హెచ్చరించారు. ప్రజలను ఇబ్బంది పెట్టే వారిని తమ సర్కారు వదిలిపెట్టబోదని తేల్చి చెప్పారు. సం?ధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనలో అసలు ఏం జరిగిందో ప్రభుత్వం ఒక ప్రకటన చేయాలని ఎంఐఎం నేత అక్బరుద్దీన్ కోరారు. దాంతో, సీఎం రేవంత్ రెడ్డి స్పందిస్తూ.. ఈ ఘటనపై విపక్షాలు, సినీ ఇండస్ట్రీ వ్యవహరించిన తీరుపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఈనెల 4న పుష్ప-2 సినిమా విడుదలవుతుందని, ఆ రోజు చిత్ర యూనిట్ సభ్యులు, హీరో, హీరోయిన్ వస్తున్నారని, బందోబస్తు కావాలంటూ ఈనెల 2న సంధ్య థియేటర్ యాజమాన్యం చిక్కడపల్లి పోలీసు స్టేషన్లో దరఖాస్తు పెట్టుకుంది. దాంతో, ఆ థియేటర్ పరిసరాల్లో పది వరకు సినిమా హాళ్లు, రెస్టారెంట్లు ఉన్నాయని, ఎంట్రీ, ఎగ్జిట్ ఒక్కటేనని, సెలబ్రిటీలు వస్తే జనాన్ని అదుపు చేయడం కష్టమని, బందోబస్తు ఇవ్వడం కుదరదని మూడో తేదీనే చిక్కడపల్లి పోలీసులు రాతపూర్వకంగా జవాబిచ్చారు. దరఖాస్తును తిరస్కరిస్తున్నట్లు అందులో చెప్పారు. పోలీసులు అనుమతి ఇవ్వకపోయినా పుష్ప సినిమా హీరో థియేటర్‌కు వెళ్లారు.కేవలం సినిమా చూసి వెళ్లిపోతే అభ్యంతరం ఉండేది కాదు. కానీ, ఆర్టీసీ క్రాస్ రోడ్ నుంచే కారు రూఫ్ టాప్ ఓపెన్ చేసి రోడ్ షో చేసుకుంటూ వెళ్లారు. దీంతో, పక్కన ఉన్న అన్ని థియేటర్ల నుంచి అభిమానులు ఒక్కసారిగా థియేటర్ వైపు వచ్చారు. హీరో కారు థియేటర్ లోపలికి పంపేందుకు గేట్లు తెరిచారు. దాంతో ఆయన్ను చూసేందుకు అభిమానులంతా ఒక్కసారిగా లోపలికి తోసుకుంటూ వచ్చారు. వారిని నిలువరించేందుకు హీరో ప్రైవేటు సెక్యూరిటీ, బాడీ గార్డ్స్ గట్టిగా వెనక్కు నెట్టారు. అది తొక్కిసలాటకు దారి తీసింది. ఈ క్రమంలో జరిగిన తొక్కిసలాటలో రేవతి చనిపోయారు. ఆమె కుమారుడికి ఆక్సిజన్ అందక బ్రెయిన్ డ్యామేజ్ అయింది. కోమాలోకి వెళ్లాడు. అంత తొక్కిసలాటలో కూడా ఆ తల్లి కొడుకు చేయి విడిచిపెట్టలేదు. కొడుకు చేయి పట్టుకుని ఆ తల్లి చనిపోయింది. హీరో థియేటర్ లోపల ఉండడంతో అక్కడ కూడా తొక్కిసలాట జరిగింది. ఈ విషయాన్ని సంధ్య థియేటర్ యాజమాన్యానికి చెప్పి, హీరోను అక్కడి నుంచి వెళ్లిపోవాలని పోలీసులు చెప్పారు. అయినా, వారు వినలేదు.సరికదా బాడీ గార్డులు పోలీసులను నిలువరించారు. పరిస్థితి చేజారే ప్రమాదం ఉందని గుర్తించి ఏసీపీ రంగంలోకి దిగారు. శాంతి భద్రతలు చేయి దాటే ప్రమాదం ఉందని, ఇప్పటికే ఒకరు చనిపోయారని, మరొకరు ఆస్పత్రి పాలయ్యారని హీరోకు ఏసీపీ వివరించారు. తక్షణమే థియేటర్ నుంచి వెళ్లిపోవాలని సూచించారు. అయినా.. సినిమా మొత్తం అయిపోయిన తర్వాతే వెళ్తానని అంటూ బయటకు వెళ్లడానికి హీరో ఒప్పుకోలేదని సిటీ కమిషనర్ చెప్పారు. దీంతో డీసీపీ వెళ్లి ఇక్కడి నుంచి కదలకపోతే అరెస్టు చేస్తామని హెచ్చరించి హీరోను కారు ఎక్కించారు. థియేటర్ నుంచి వెళ్లేటప్పుడు కూడా కార్ రూఫ్ టాప్ ఓపెన్ చేసి రోడ్ షో చేస్తూ వెళ్లారు" అని వివరించారు. ఈ నేపథ్యంలోనే హీరోపై, యాజమాన్యంపై పోలీసులు కేసు పెట్టారని, తర్వాత హీరో ఇంటికి వెళ్లినప్పుడు కూడా దురుసుగా ప్రవర్తించాడని, బాధ్యతారహితంగా సమాధానాలు ఇచ్చాడని, అందుకే పోలీసులు వారి విధి నిర్వహించారని వివరించారు.

**కేటీఆర్‌ది పైశాచికత్వం**

ఒకరి మృతికి కారణమైన వారిని పోలీసు స్టేషన్‌కు తీసుకెళితే.. కొన్ని రాజకీయ పార్టీలు పైశాచికత్వం ప్రదర్శించాయని మాజీ మంత్రి కేటీఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "రేవతి భర్త చిరుద్యోగి. నెలకు రూ.30 వేలే జీతం. అయినా.. తన కొడుకు ఆ హీరో అభిమాని అని తనయుడి కోసం ఒక్కో టికెట్ రూ.3 వేల చొప్పున రూ.12 వేలు పెట్టి కొన్నారు. హీరోపై అభిమానంతో అంత డబ్బు వెచ్చించారు. థియేటర్‌లో ఒక తల్లి చనిపోతే ఆ కుటుంబాన్ని, ఆ పిల్లవాడిని హీరో పరామర్శించలేదు. అలాంటి మానవత్వం లేని వాళ్లను పోలీస్స్టేషన్‌కు తీసుకెళ్తే పదేళ్లు మంత్రులుగా పని చేసిన వాళ్లు కూడా ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నారు. తప్పు పట్టి ప్రభుత్వాన్ని బద్నాం చేయాలని చూశారు. సోషల్ మీడియాలోనూ, యూట్యూబ్ చానెల్స్‌లోనూ ఎంతో నీచమైన భాష వాడారు" అని తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు.

# నాపై తప్పుడు ఆరోపణలు!

(మొదటి పేజీ తరువాయి)

ప్రేక్షకులకు వినోదాన్ని అందించడమే ముఖ్య కర్తవ్యంగా భావిస్తానని ఆయన తెలిపారు. "మిమ్మల్ని నవ్విస్తూ ఉంచాలనుకుంటాను. మీ మనసుల్ని గెలిచి థియేటర్ నుంచి బయటకు పంపిద్దామనుకుంటాను. నాకు థియేటర్ ఒక గుడిలాంటిది. అలాంటి చోటఈ ప్రమాదం జరగడం బాధాకరం. ఈ విషయంలో నాకంటే బాధపడేవాడుండడు. నేను గంటగంటకూ బాలుడి ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకుంటున్నాను. మంచి విషయం ఏంటంటే తను కదులుతున్నాడు.. కొంచెం కొంచెం కోలుకుంటున్నాడని తెలిసింది. ఇప్పుడు ఉన్న పరిస్థితిలో ఇది ఊరటనిచ్చే విషయం" అని పేర్కొన్నారు. అయితే, ఈ విషయంలో తనపై కొన్ని తప్పుడు ఆరోపణలు, అవాస్తవాలు ప్రచారం అవుతున్నందునే పత్రికా సమావేశం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. బహుశా కమ్యూనికేషన్ లోపం వల్లే తనపై ఈ తప్పుడు ప్రచారం జరుగుతుండవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. " ఈ ప్రమాదం విషయంలో నన్ను పూర్తిగా అపార్థం చేసుకున్నారు. నేను ఎవర్నీ నిందించడం లేదు. ఏ డిపార్టుమెంటునీ, ప్రత్యేకించి ఏ రాజకీయ నాయకుడిని, ప్రభుత్వాన్ని అనడం లేదు. నిజానికి మాకు సినిమా విషయంలో ప్రభుత్వం ఎంతో సాయం చేసింది. ప్రత్యేక టికెట్ రేట్ మంజూరు చేసింది. ముఖ్యంగా ప్రభుత్వం విషయంలో చాలా సంతృప్తితో ఉన్నాను. ఇది ఎవ్వరినీ ఉద్దేశించి కాదు. నాపై జరుగుతున్న ప్రచారం.. క్యారెక్టర్ ఎసాసినేషన్ (వ్యక్తిత్వ హననం) గురించిమాత్రమే నేను స్పష్టతనివ్వాలనుకుంటున్నాను" అని స్పష్టం చేశారు. "నన్ను మీరంతా 20 ఏళ్లుగా చూస్తున్నారు. నేను ఎప్పుడైనా ఇలా నిర్లక్ష్యంగా ఉన్నానా? ప్రీమియర్ రోజు ఈ ఘటన జరిగాక సినిమా ప్రమోషన్స్ కోసం హాజరు కాలేకపోయా. ప్రమోషనల్ ఈవెంట్స్ అన్నింటినీ రద్దుచేసుకున్నా. దాదాపు 15 రోజుల నుంచి ఎక్కడికీ పోలేదు. ఇంట్లోనే విచారంగా ఉండిపోయాను. నేను మూడేళ్లు కష్టపడి చేసిన ఈ సినిమాను ఇప్పటివరకూ థియేటర్‌లో చూడలేదు" అని ఆవేదన వెలిబుచ్చారు. ఈ ప్రమాదం విషయంలో తన తప్పేమీ ప్రత్యక్షంగా లేదని సర్దిచెప్పుకొంటున్నానని అల్లు అర్జున్ పేర్కొన్నారు. "ఇటువంటి సమయంలో నేను ఇలా అన్నాను.. అలా అన్నాను..

# గిరిజన యువత తలుచుకుంటేనే మార్పు సాధ్యం



విజయనగరంద: ప్రభుత్వంలో పవన్ కల్యాణ్ భాగస్వామి అయ్యాడంటే.. ప్రతీ గిరిజన యువకుడు ప్రభుత్వంలో వున్నట్టే లెక్క అంటూ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. డోలీ రహిత ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. ఇక్కడ ప్రజల ఆవేదన, బాధ తెలుసుకోవడం కోసమే అటవీ ప్రాంతంలో పర్యటించామన్నారు. రూ.105 కోట్లతో పంచాయతీ రాజ్ శాఖ ద్వారా రోడ్లు నిర్మిస్తున్నామని చెప్పారు. ఎన్నికల కోసమో, ఓట్ల కోసం మా ప్రభుత్వం పనిచేయదని.. ప్రజల కష్టాలు, కన్నీళ్లలో మేం వున్నామని కచ్చితంగా చెబుతున్నామన్నారు. 19 పనులు ప్రారంభించామని ఆయన తెలిపారు. అల్లూరి జిల్లా అనంతగిరి మండలం గుమ్మంతి పర్యటనలో గిరిజనుల సమస్యను పవన్

కల్యాణ్ అడిగి తెలుసుకున్నారు. 'డోలీ మోతల విముక్త ఏపీ'లో భాగంగా మారుమూల గిరిజన గ్రామాలకు రహదారి నిర్మాణం కోసం డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ భూమి పూజ చేశారు. గిరిజన యువత తలుచుకుంటేనే మార్పు సాధ్యమని.. ప్రభుత్వం మారింది, పంచాయతీ సర్పంచ్‌లు తల ఎత్తుకుని తిరిగే పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన లక్ష్యంగా ప్రణాళిక బద్ధంగా పనిచేస్తున్నామన్నారు. 100 మంది జనాభా ఉన్న గ్రామాలకు రోడ్లు నిర్మాణం ప్రధాని నరేంద్ర మోడీ మహా సంకల్పమని వెల్లడించారు. ఏటా రూ. 350కోట్లు రహదారులు, ఇతర అవసరాల కోసం కేటాయిస్తామని చెప్పారు. ప్రజల నమ్మకం గెలుచుకోవడానికి ఇక్కడకు వచ్చాను.. ఐదేళ్ల పనితీరు గమనించి ప్రోగ్రెస్ రిపోర్ట్ ఇవ్వాలన్నారు. తాను, ముఖ్యమంత్రి మనసు పెట్టకపోతే ఇవాళ ఏజెన్సీలో రోడ్లు లేవన్నారు. ౧÷నాన్స్ ఎలా హ్యాండిల్ చెయ్యాలో తెలియదు.. ప్రజల ఇబ్బందులను తెలుసుకోవడం వాటిని పరిష్కరించడం మాత్రం తెలుసన్నారు. జనవరిలో రూ.250కోట్లు రహదారుల నిర్మాణం కోసం కేంద్రం నిధులు ఇవ్వనుందని తెలిపారు. తిట్లు తిన్నాం.. కుటుంబ సభ్యులను టా÷-గ్గ÷ట్ చేసినా భరించి నిలబడ్డాం.. దాని ఫలితం ఇవాళ ప్రజలకు సర్వీస్ చేసే అవకాశం లభించిందన్నారు. గంజాయిని ఒక సామాజిక సమస్యగా చూడాలని పవన్ అన్నారు. గంజాయి గిరిజన ఆచార వ్యవహారాలు దాటి కమర్షియల్ అయిందన్నారు. యువత, పిల్లలు చెడిపోవడానానికి గంజాయి కారణమంటూ వ్యాఖ్యానించారు. మత్తులో ఇటీవల కడపలో టీచర్‌పై దాడి చేసి కొందరు విద్యార్థులు దారుణంగా ప్రవర్తించారన్నారు. ప్రత్యామ్నాయ మార్గాలు కల్పిస్తామన్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. గంజాయి సాగు వదిలేయమని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. గంజాయి గ్రామాలను దాటి ఎక్స్‌పోర్ట్ వరకు వెళ్లడంతో ఏపీ గంజాయి కేపిటల్‌గా మారిందని మండిపడ్డారు. గంజాయిని మీరు వదిలే వరకు మిమ్మల్ని వదలనన్నారు

# పథకంపై ఇచ్చిన నివేదికను సభలో పెట్టండి

హైదరాబాద్, : రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసాను ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తున్నదని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ ఆరోపించారు. ఆదాయపు పన్ను చెల్లించేవారికి, ఉద్యోగం చేస్తున్నవారికి, పాన్ కార్డులు ఉన్నవారికీ రైతు భరోసా ఇవ్వొద్దని ప్రభుత్వం ఆలోచన చేస్తున్నదని, ఇది సరైంది కాదన్నారు. రాష్ట్రంలో దాదాపు కోటి మందికిపైగా పాన్ కార్డులు ఉన్నాయని, వీరిలో రైతులు కూడా ఉన్నారని చెప్పారు. రైతుల పిల్లల్లో కొందరు ఉద్యోగం చేస్తున్నవారు ఉన్నారని, అలాంటి రైతులకూ రైతుభరోసా ఇవ్వబోమంటే ఎలా అని ప్రశ్నించారు. శనివారం శాసనసభలో రైతు భరోసా పథకంపై స్వల్పకాలిక చర్చ సందర్భంగా, అసెంబ్లీ సమావేశాలు ముగిసిన తర్వాత మీడియా పాయింట్ వద్ద కేటీఆర్ మాట్లాడారు. రైతుబంధు (రైతు భరోసా)ను అవమానిస్తున్నారని, ఈ పథకం ఉసురు తీయొద్దని విజ్ఞప్తి చేశారు. రైతు భరోసా విదివిధానాలను ఖరారు చేసేందుకు నియమించిన మంత్రివర్గ ఉపసంఘం ఇచ్చిన నివేదికను సభలో ప్రవేశపెట్టి అందరికీ వివరించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించినట్లుగా రుణమాఫీ అందరికీ వర్తించలేదన్నారు. సిరిసిల్ల, పాలేరు, కొండారెడ్డిపల్లెతో పాటు రాష్ట్రంలోని ఏ ఊరిలోనూ వందశాతం రుణమాఫీ జరగలేదని పేర్కొన్నారు. ఏ గ్రామంలోనైనా వందశాతం రుణమాఫీ అయినట్టు చూపించినా, 24 గంటల కరెంట్ ఇస్తున్నట్లు నిరూపించినా తనతో పాటు బీఆర్‌ఎస్ సభ్యులమంతా రాజీనామా చేస్తామని సవాల్ విసిరారు. సీఎం రేవంత్ దేవుడు కాదు.. పచ్చి దొంగ అని, ఓటుకు నోటు కేసులో చిక్కిన దొంగ అని ఘాటుగా విమర్శించారు. తమ ప్రభుత్వ హయాంలో పాలమూరును సస్యశ్యామలం చేశామని, రైతులకు ఉచితంగా సాగు నీటిని అందించామని చెప్పారు. లక్షల కోట్లతో ప్రాజెక్టులు నిర్మించినా రైతులపై భారం వేయలేదన్నారు. గతంలో సాగు చేసినా.. చేయకపోయినా భూములన్నింటికీ రైతుబంధు పథకాన్ని అమలు చేయడం వల్లే 141 లక్షల ఎకరాల నుంచి 2.06 కోట్ల ఎకరాలకు సాగు పెరిగిందని చెప్పారు. 4.5 లక్షల ఎకరాల పోడు పట్టాలకూ రైతుబంధు అమలు చేశామని, గిరిజనులు ఒకే పంట పండిస్తారని, అయితే ఒక పంటకే రైతు భరోసా ఇస్తారా..? లేక రెండో పంటకూ ఇస్తారా..? లేదా..? చెప్పాలన్నారు.

# సిద్దిక్ నగర్‌లో అక్రమ నిర్మాణాలు సీజ్







**శేరిలింగంపల్లి, డైలీ రిపోర్ట్:** శేరిలింగంపల్లి సర్కిల్-20 పరిధిలోని అక్రమ నిర్మాణాలపై అధికారులు కఠిన చర్యలు తీసుకుంటున్నారు. జోనల్ కమిషనర్ ఉపేందర్రెడ్డి ఆదేశాల మేరకు సర్కిల్ పరిధిలోని అక్రమ నిర్మాణాలను గుర్తించిన అధికారులు ఏకంగా సీజ్ మంత్రం పాటిస్తున్నారు. శనివారం కొండాపూర్ డివిజన్ పరిధిలోని సిద్ధిక్నగర్లో పోలీసు బందోబస్త్ నడుమ ఏకంగా 10 అక్రమ నిర్మాణాలను సీజ్ చేశారు. ఇప్పటికే గత శనివారం 6 భవనాలను సీజ్ చేసిన విషయం తెలిసిందే. అక్రమ నిర్మాణాలను ఒక్కొక్కటిగా గుర్తించి సమస్యలు తలెత్తకుండా నోటీసులు జారీ చేసి సీజ్ చేస్తున్నట్లు టౌన్‌ప్లానింగ్ ఏసీపీ వెంకటరమణ తెలిపారు. అనుమతులు లేకుండా భవన నిర్మాణాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. అనుమతులు ఉన్నంత వరకు నిర్మాణాలు చేయాలని, అదనపు అంతస్తులు చేపట్టిన ఇదే తంతు కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ సెక్షన్ ఆఫీసర్ జీషన్, చైన్మెన్ ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

## పారదర్శకంగా ఇందిరమ్మ ఇండ్ల సర్వే: శంకర్‌పల్లి మున్సిపల్ కౌన్సిలర్ బిసొల్ల సంధ్యారాణి అశోక్ కుమార్





**శంకర్‌పల్లి డిసెంబర్ 21:(డైలీ రిపోర్ట్):** ఇందిరమ్మ ఇండ్ల సర్వే పారదర్శకంగా నిర్వహించాలని శంకర్‌పల్లి మున్సిపల్ రెండో వార్డ్ కౌన్సిలర్ బిసొల్ల సంధ్యారాణి అశోక్ కుమార్ మరియు కమిషనర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. పట్టణ పరిధి 2,11 వార్డులలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియను శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కౌన్సిలర్ మాట్లాడుతూ సర్వేయర్లు ఇంటింటికీ తిరుగుతూ ఇందిరమ్మ ఇళ్ల పథకం కోసం ప్రజాపాలనలో దరఖాస్తులు చేసుకున్న అర్జీదారుల వివరాలను సేకరిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తూ, పొరపా ట్లకు తావులేకుండా దరఖాస్తుదారుల వివరాలను ఆన్లైన్ మొబైల్ యాప్ లో జాగ్రత్తగా నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ నెలాఖరులోగా ప్రణాళికాబద్ధంగా సర్వే పూర్తి చేయాలని అన్నారు. అర్హత కలిగిన కుటుంబాలకు ప్రభుత్వం ప్రాధాన్యత క్రమంలో నిరంతర ప్రక్రియగా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయ నుందన్నారు. మున్సిపల్ సిబ్బంది మరియు కాలనీవాసులు మధు సుధాకర్ పూర్ణ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## వైష్ణవి ఒలంపియాడ్ స్కూల్లో ఘనంగా గణిత దినోత్సవం

**అమీన్ పూర్ /రామచంద్రపురం డిసెంబర్ 21(డైలీ రిపోర్ట్):** ప్రముఖ గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ పుట్టినరోజు సందర్భంగా బీరంగూడ మధుర నగర్ లో ఉన్న వైష్ణవి ఒలంపియాడ్ స్కూల్లో గణిత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. స్థానిక కౌన్సిలర్ ఎడ్ల రమేష్, ఇష్ట స్కూల్ ప్రిన్సిపల్ ప్రేమ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. గణితం యొక్క ప్రాముఖ్యతను వివరిస్తూ వివిధ రకాల ప్రదర్శనలను విద్యార్థులు నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచం గర్వించదగ్గ గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ అని అతి చిన్న వయసులోనే యావత్ ప్రపంచానికి ఆదర్శంగా నిలిచారని వారిని ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్క విద్యార్థి గణితం పట్ల మక్కువ పెంచుకొని ఎన్నో విజయాలు సాధించాలని వారు ఆకాంక్షించారు ,ఈ కార్యక్రమంలో వైష్ణవి స్కూల్ చైర్మన్ సుశీల్ కుమార్ వర్మ ,ప్రిన్సిపల్ హరిప్రియ,ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.




## మన్మర్రి పాఠశాలలో తెలంగాణ ఆహార మహోత్సవం

**శంకర్‌పల్లి డిసెంబర్ 21:(డైలీ రిపోర్ట్):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలనుసారం శనివారం షాబాద్ మండల ప్రాథమిక పాఠశాల మన్మరిలో తెలంగాణ ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు వారి తల్లిదండ్రుల భాగస్వామ్యంతో ఇంటి దగ్గర తయారు చేసుకొని తెచ్చిన వివిధ రకాల పిండి పదార్థాల, మాంసకృతుల, పీచు పదార్థాల, విటమిన్ల పోషక విలువలు గల ఆహార పదార్థాలు, కూరగాయలుఆకుకూరలు, పండ్లు, పాలు,పెరుగు తదితర తినుబండారాలను పాఠశాలలో ప్రదర్శించడం జరిగింది. ప్రధానోపాధ్యాయురాలు అనురాధ ఉపాధ్యాయుడు మర్పల్లి అశోక్ మాట్లాడుతూ విద్యార్థుల శారీరక మరియు మానసిక అభివృద్ధి కోసం ప్రతిరోజు పౌష్టికాహారాన్ని తల్లిదండ్రులు అందించాలని, అందులో ముఖ్యంగా కూరగాయలు, ఆకుకూరలు, పిండి పదార్థాలు, మాంసకృతులు గల ఆహారాన్ని అందించాలని తెలిపారు. పిల్లల్లో రోగ నిరోధక శక్తి పెరగాలంటే ప్రతి రోజు ఉడికించిన కోడిగుడ్డు, పాలు, పెరుగు, మాంసకుతులకు సంబంధించిన ఆహార పదార్థాలను పెట్టాలని, వీదుల్లో దొరికే లేస్, కుర్కురే, మాగీ, నూడుల్స్, మంచూరియా, ఫిజ్జా, బర్గర్ తదితర జంక్ ఫుడ్ కు దూరంగా ఉంచాలని సూచించారు. పిల్లలు ఆహారాన్ని తీసుకునే ముందు చేతులు శుభ్రంగా సబ్బుతో గాని, డెటాల్ తో గాని కడుకోవాలని కోరారు. విద్యార్థులు ఫుడ్ పాయిజన్ కి గురి కాకుండా వంట చేసేటప్పుడు ఇంటిదగ్గర గాని, పాఠశాలల్లో గాని వంట పాత్రలు శుభ్రంగా కడగాలని, అదే విధంగా కూరగాయలు మంచి నీటితో శుభ్రం చేయాలని, వండిన ఆహారంపై సరిపడా మూతలు పెట్టాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు శంకర్, రవి, మల్లేష్, యాదయ్య, నరసింహులు, మమత, వెంకటేశ్వరి, యాదమ్మ, నాజియా, నూరిన్ పాల్గొన్నారు.





## శంకర్‌పల్లి రేవతి హై స్కూల్ లో ఘనంగా క్రిస్మస్ వేడుకలు




**శంకర్‌పల్లి డిసెంబర్ 21:(డైలీ రిపోర్ట్):** క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని రేవతి హైస్కూల్లో శనివారం ఘనంగా క్రిస్మస్ వేడుకలు జరిగాయి. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను కరస్పాండెంట్ శ్రీనివాస్ అభినందించారు. అకాడమిక్ డైరెక్టర్ పావని మాట్లాడుతూ ఏసుక్రీస్తు అందరివాడన్నారు. సమాజ శ్రేయస్సు కోసమే ఏసుక్రీస్తు కృషి చేశాడని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజు, జ్యోత్స్నశ్రీ, ఇన్చార్జ్ అర్చన, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




## కేంద్ర హెూం మంత్రి అమిత్ షాను పదవి నుండి తొలగించెంత వరకు పోరాడుతాం

### అయన పార్లమెంట్ సభ్యత్వం రద్దు చేయాలి

**సంగారెడ్డి బ్యూరో డిసెంబర్ 21(డైలీ రిపోర్ట్):** సంగారెడ్డిలో సామాజిక ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సంగారెడ్డి లోని అంబెడ్కర్ స్టడీ సర్కిల్ లో అంబేద్కర్ స్టడీ సర్కిల్ డైరెక్టర్ న్యాయవాది రామారావు అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించడం జరిగింది ఈ సందర్బంగా వక్తలు మాట్లాడుతు భారత రాజ్యాంగంపై ప్రమాణం చేసి దేశ హెూం శాఖ మంత్రిగా పనిచేస్తున్న అమిత్ షా నిండు రాజ్యసభలో మహనీయులు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నామని అన్నారు అంబేద్కర్ గారు పీడిత వర్గాల కోసం తన జీవితాన్ని అంకితం చేశారని అలాంటి మహనీయుపై అనుచితంగా మాట్లాడటం సరియైనది కాదని బి జె పి మొదటి నుండి బయట అంబేద్కర్ గారికి నివాళులు అర్పిస్తూనే అంబేద్కర్ వాదాన్ని భారత రాజ్యాంగాన్ని లేకుండా చేయాలని చూస్తున్నారని రాజ్యాంగం స్థానంలో మనువాదాన్ని తీసుకురావాలని చూస్తున్నారని ఎట్టి పరిస్థితుల్లోనూ వాళ్ల కుట్రలను సాగనివ్వమని అన్నారు తక్షణమే అమిత్ షాను హెూం మంత్రి పదవి నుండి తొలగించలని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అవమానించినందుకు అమిత్ షా దేశ ప్రజలందరికీ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దళిత సామాజిక ప్రజా ఉద్యమ నాయకులు బీసీ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బీరయ్య యాదవ్ ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు దుర్గాప్రసాద్ కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి అశోక్ ఎం బి టి నాయకులు అన్వర్ న్యాయవాది లక్ష్మి ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు బి అశోక్ సీనియర్ దళిత నాయకులు నాగయ్య గిరిజన సంఘం నాయకులు జైపాల్ నాయక్ రాజేందర్ నాయక్ ప్రవీణ్ బస్వరాజ్ బాల్రాజ్ ఉదయ్ యాదగిరి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు

## లిటిల్ స్టార్ హై స్కూల్ లో ఘనంగా జాతీయ మ్యాథ్స్ డే వేడుకలు





**శంకర్‌పల్లి డిసెంబర్ 21:(డైలీ రిపోర్ట్):** శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని లిటిల్ స్టార్స్ హై స్కూల్ లో జాతీయ మ్యాథ్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఎస్సై తుకారాం హాజరై మాట్లాడుతూ ఉద్దండులే పరిష్కరించలేని గణిత సమస్యలను తన అపార మేధా సంపత్తితో చిటికెలోనే పరిష్కరించి వారి నుంచి ప్రశంసలుందుకున్నారు శ్రీనివాస్ రామానుజన్ అని కొనియాడారు. కరస్పాండెంట్ సంజీత్ కుమార్ మాట్లాడుతూ అందుకే ఆయన పుట్టిన రోజును జాతీయ గణిత దినోత్సవంగా జరుపుకుంటున్నాం అని తెలియజేశారు. నిరుపేద కుటుంబంలో జన్మించిన రామానుజన్ గణితంపై ఎక్కువ శ్రద్ధ పెట్టడంతో ఎఫ్ఏ పరీక్షల్లో తప్పారు. తన మేధతో క్లిష్టమైన గణిత సూత్రాలను అవలీలగా చేసి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు దక్కించుకున్నారు. రామానుజన్‌లోని ప్రతిభను బయటకు తీసింది మాత్రం జీఎస్ కార్ రచించిన గణిత పుస్తకం.సర్వశాస్త్రాలకు తల్లివంటిది గణితం, అటువంటి గణితశాస్త్రానికి పుట్టిల్లు భారతదేశము. మిగిలిన ప్రపంచములో విజ్ఞానశాస్త్రము ఉదయించకముందే ఇక్కడ మహాపురుషులు ఖగోళశాస్త్రాన్ని అత్యున్నత స్థాయికి తీసుకు వెళ్ళారు. కాల గమనము, గ్రహణాల అంచనాలు, పంచాంగ నిర్మాణము వంటివన్నీ వారి ప్రతిభకు నిదర్శనము. అంకెలు కనుగొన్నది, గణితంలో కీలకమైన సున్నాని కనుగొన్నది భారతీయులే అని, భారతీయుల గణిత వేత్తల ఘనతను పిల్లలకు గుర్తు చేశారు. అనంతరం మాథ్స్ ఉపాధ్యాయులకు సన్మానం చేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ సంజిత్ కుమార్ గారు, ప్రిన్సిపాల్ స్వర్ణలత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.













# అంబేద్కర్‌ను అవమానించిన అమిత్ షా క్షమాపణ చెప్పాలి..



**సంగారెడ్డి బ్యూరో ,డిసెంబర్ 21(డైలీ రిపోర్ట్):** పార్లమెంట్ లో రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేద్కర్ ను అవమానించిన అమిత్ షా క్షమాపణలు చెప్పాలని సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి డిమాండ్ చేశారు. అంబేద్కర్ పై కేంద్ర హెూంమంత్రి అమిత్ షా, బీజేపీ నాయకుల అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ జగ్గారెడ్డి ఆధ్వర్యంలో సంగారెడ్డిలోని ఐబీ నుంచి పాత బస్టాండు వద్ద గల అంబేద్కర్ విగ్రహం వరకు కాంగ్రెస్ శ్రేణులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. పాత బస్టాండు వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ ప్రతి మనిషి శాంతితో, సుఖశాంతులతో ఉన్నారంటే అది డా.బీఆర్.అంబేద్కర్ చలువే అన్నారు. రాజ్యాంగం వల్లే దేశం సుఖశాంతులతో ఉండడం సాధ్యమైందన్నారు. పార్లమెంట్ లో స్పీకర్ సాక్షిగా అంబేద్కర్ ను హెూంమంత్రి అమిత్ షా కించపరిచారన్నారు. రాహుల్ గాంధీ భేషరతుగా క్షమాపణ చెప్పాలని పార్లమెంట్ లో ప్రశ్నించారు. కానీ ఇప్పటి వరకు క్షమాపణ చెప్పలేదన్నారు. పార్లమెంట్ బీజేపీ ఎంపీలు రాహుల్ గాంధీని అడ్డుకున్నారు. అంబేద్కర్ ను అవమానించిన అమిత్ షా అంబేద్కర్ కు వెంటనే క్షమాపణ చెప్పాలని, క్షమాపణ చెప్పే వరకు వివిధ ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తామని హెచ్చరించారు.దేశంలో ప్రతి ఒక్కరూ ప్రశాంతంగా ఉన్నారంటే అంబేద్కర్ రాజ్యాంగం వల్లే అది సాధ్యమైందన్నారు. నాడు నెహ్రూ క్యాబినెట్ లో నే అంబేద్కర్ రాజ్యాంగం రాశారని అలాంటి అబేంద్కర్ ను బీజేపీ అవమానిస్తే రాహుల్ గాంధీ నిలదీస్తున్నారన్నారు. అందరూ అన్నదమ్ముల్లా కలిసుండాలనేది కాంగ్రెస్ సిద్ధాంతమన్నారు. రాహుల్ గాంధీ కుటుంబం త్యాగాల కుటుంబం అని ప్రజల కోసం ప్రాణాలు అర్పించిన చరిత్ర కాంగ్రెస్ ది అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఒక దళితున్ని దేశ అధ్యక్షున్ని చేసిందని, బీజేపీ పార్టీ దళితున్ని జాతీయ అధ్యక్షుడిని చేస్తుందా అని ప్రశ్నించారు. అంబేద్కర్ ఆశయాలు పాటించేవారు జాతీయ అధ్యక్షుడు ఖర్గే అన్నారు. అంబేద్కర్ ను అవమానించిన బీజేపీ క్షమాపణ చెప్పాలని, క్షమాపణ చెప్పేవరకు ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, సీడీసీ చైర్మన్ రాంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రాంచందర్, ఆత్మ కమిటీ చైర్మన్ వై.ప్రభు, నాయకులు తోపాజీ అనంతకిషన్, కూన సంతోష్, ప్రవీన్, మునిపల్లి సత్యనారాయణ, జార్జ్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.









Printed And Published By Bakka Ravinder,on Behalf of Daily Report Publications And broadcasting News, Sangareddy Municipality, Ganesh Nagar HNo 3-11/ Sangareddy District Telangana state , Editor. B. shirisha print code TELTEL.2019/082422 , Cell 8501919707